# మరీచిక

కొండ మధ్య గట్టుమీదనుంచి నీళ్ళు ధారగా ఉవ్వెత్తుగా పడుతున్నాయి. ఆకొండ చాలా ఎత్తైంది. ఆ నీళ్ళ ధార దగ్గరనుంచి అలా తల పైకెత్తి చూస్తే పచ్చని ఆకులతో నిండి ఆకొండ కన్నులపండువుగా ఉంటుంది ఆకాశాన్ని కప్పుతూన్నట్లుంది. ఆ కొన శిఖరం ఎక్కడో ఎంతో దూరాన ఉన్నట్లుంటుంది. ఎవరైనా ఆ కొనదాకా ఎక్కగలరా అనిపిస్తుంది.

రోజూ నీల ఆ నీటిధార దగ్గర కూర్చుంటుంది. నీళ్ళల్లో కాళ్ళు తడుపుకుంటూ నీటి బిందువులు అప్పుడప్పుడు చింది నెత్తిన పడుతూ ఉంటాయి. చల్లగా ఆ నీళ్ళు ఒంటికి తగలగానే నీలకు వళ్ళు పులకరిస్తుంది. సంతోషం కలుగుతుంది.

ఆ నీళ్ళధార ఎక్కడో కొండశిఖరం దగ్గరనుంచి వస్తుంది. ఆ గట్టువరకు సన్నని కాలవలా జలజలా ప్రవహించి వస్తుంది. ఆ మధ్య గట్టుదగ్గర ఎత్తుగా ధారగా క్రిందకు పడుతుంది. ఒక్కొక్కసారి నీల గట్టుపైకి ఎక్కి కాలువగా ప్రవహిస్తున్న నీటిపాయదగ్గర కూర్చుంటుంది.

అక్కడే నిద్రపోతుంది. ఒక్కక్షణం ఆశగా ఆ కొండశిఖరం వైపు చూస్తుంది. అంతదూరం ఎక్కగలిగితే! ఆ కొనకు చేరగలిగితే! ఎంత బాగుంటుంది! కాని ఒంటరిగా ఎక్క పోవడానికి ఆమెకు ధైర్యంలేదు. ఆశగా ఊరికే అలా చూస్తూ ఉంటుంది. అది ఒక తీరని కోరిక! ఆ కొండ శిఖరాన ఒక సన్యాసి కాపురమున్నాడుట! అతన్నెప్పుడూ నీల చూడలేదు. అతను క్రిందికి దిగిరాలేదు ఎప్పుడూ! ఎవరూ పైకి వెళ్ళలేదు. రోజూ రాత్రిపూట ఆ కొండ శిఖరాన ఒక దీపం వెలుగుతుంది. చాలా రాత్రి వరకూ రెపరెపలాడుతూ ఉంటుంది. అంచేత అందరూ అక్కడ ఒక యోగి ఉన్నాడంటారు.

కొండగట్టుకు చాలా క్రిందవేపున పల్లంలో నీల పాక ఉంది. అందులో ఎవరూ లేరు అవ్వా, తనూ తప్ప! కొండకు కొద్దిగా వెనుకవేపున ఒక చిన్న పల్లెఉంది. అవ్వ ఇదివరకు అక్కడే ఉండేదిట, తన తల్లి బ్రతికిఉండగా! అవ్వ చెపుతుంది అప్పుడప్పుడూ, "మీ అమ్మ నీఅంత ఉండగా మేము ఆ పల్లెలోనే ఉండేవాళ్ళం! మీ అమ్మ రోజూ ఈ నీళ్ళధార దగ్గరకు వస్తూండేది. ఇక్కడే తిరుగుతూ ఉండేది, గొడ్లను చూసుకుంటూ, ఒకసారి ఇక్కడ ఎవరినో కలుసుకుందిట. అతనికోసం చాల బెంగపెట్టుకుంది. అతను మళ్ళా వస్తానని మాట ఇచ్చాడు. కాని మళ్ళా రాలేదు. నిన్ను ప్రసవించాక ఉష్ణం తగిలి మీ అమ్మ చనిపోయింది. అదిగో ఆమామిడిచెట్టు ఉందే, అక్కడే దహనం

చేశాం ! ఈ నీళ్ళధార దగ్గరే ఉండాలని మీ అమ్మ కోరిక! ఆ మామిడిమొక్క నేనే నాటాను. అది చూస్తూవుంటే మీ అమ్మను చూసినట్లే ఉంటుంది. అది పూతపూస్తే మీఅమ్మ నవ్వినట్లే ఉంటుంది. అందుకే పల్లె వదలివచ్చి ఇక్కడే ఉంటున్నాను." అని, అమ్మ బ్రతుకు అంతా ఏదో ఒకసారి కళ్లకు కట్టినట్లు ఉంటుంది. ఆ మామిడి చెట్టుకేసి చూస్తో వుంటే తనకూ అమ్మను చూసినట్లే ఉంటుంది.

అవ్వకు ఆస్తిఏమీలేదు, రెండు బర్రెలు, కొన్ని మేకలు తప్ప. వాటిని చూసుకోవటం తనపని. కాని వాటిని మేపటం పెద్దపనేమీ కాదు. వాటి తోవన అవి కొండ మీదకు ఎక్కడికో వెళతాయి మళ్ళా సాయంత్రానికి వాటంతటవే వస్తాయి, వాటిని గురించి దిగులులేదు. తాను హాయిగా నీళ్ళధార దగ్గరా, చెట్లపొదలసందుల్లో, అక్కడా తిరుగుతూ ఉంటుంది. ఎవరూలేని-చోట తనకు చెట్లపూలు పిట్టలు ఇవే స్నేహితులు. ఆకుల గలగలలు, పక్షుల కిలకిలలు వింటూ వుంటుంది. అవి గుంపులు గుంపులుగా ఒకసారి, ఒంటరిగా ఒకసారి ఆ కొమ్మలోనించి ఈ కొమ్మలోనించి ఎగురుతూ వుంటే తనకేదో మరోలోకంలో వున్నట్లుంటుంది. ఎప్పుడూ అంతా వింతగా కొత్తగా వుంటుంది. కావలసినంత కాలక్షేపం. సాధారణంగా ఎప్పుడూ ఒంటరిగా వున్నాననిపించదు.

కొండగట్టుకు కొంచెం పైగా ఎత్తుగావున్న చోట ఇంకా రెండు పాకలున్నాయి. ఒకదాంట్లో కోకిల, గణపతి

ఉంటారు. రెండవది ఖాళీగా వుంటుంది. ఎప్పుడైనా ఎవరైనా కొండ చూడడానికి వస్తే అందులో ఓపూట వుండి వెళతారు. కోకిల వాళ్లకు వండి పెడుతుంది గణపతి కొండ చూపిస్తాడు. అవ్వకు కోకిల తోడు. మధ్యాహ్నంవేళ ఇద్దరూ మాట్లాడుకుంటూ ఉంటారు. క్రింద పాకలోంచి అవ్వ ఏదో అరిచి చెపుతుంది. పైన పాకలోంచి కోకిల ఏదో గట్టిగా జవాబు చెపుతుంది బర్రెలనుగురించో, మబ్బులనుగురించో, రాలిపోతూన్న ఆకులను గురించో సంభాషణ సాగుతూ ఉంటుంది. ఒకోసారి ఇద్దరూ కలిసి మధ్యాహ్నంవేళ బయలుదేరి పల్లెకు వెళతారు. అక్కడ అందరిని పలకరించి ఏవైనా సామాన్లుతీసుకుని సాయంత్రానికి వస్తారు.

కొండగట్టుదగ్గరనుంచి పక్కకు తిరిగిచూస్తే పెద్దలోయ కనిపిస్తుంది. రెండువేపులాకొండ పచ్చగా ఎత్తుగాఉంటుంది. మధ్యన సన్నని తోవ తెల్లగా పాములా వంపులు తిరిగి ఉంటుంది. కొండ మొదటిదాకా వచ్చి ఆ బాట ఆగిపోతుంది. దూరాన్నుండి ఎవరైనాపైకి కాలితోవన ఎక్కరావలసిందే!

ఆ వేళ మధ్యాహ్నం నీటిపాయకు ప్రక్కగా గడ్డిలో పడుకుని నిద్రపోయింది నీల. మెలకువ వచ్చేసరికి పొద్దుకూకుతోంది. సాయంత్రపు ఎఱుపు నీళ్లల్లో నిండుతోంది. చెట్ల సందుల్లో నీరెండ తళతళలాడుతోంది. నీల ఒళ్లు విరుచుకు కళ్ళు నులుపుకు అటూ ఇటూ కలయజూచింది. నీటిపాయకు అవతలి వేపున అతనెవరో కూచుని ఉన్నాడు. గడ్డిపరకలతో ఆడుకుంటున్నాడు. నీలవేపు నిదానంగా చూస్తున్నాడు. నీల

ఉలిక్కిపడింది. అతనెవరో కొత్తవ్యక్తి! అదివరకెప్పుడూ చూడలేదు ఎప్పుడువచ్చాడో! తను నిద్రపోతూఉంటేవచ్చాడేమో! ఎంతసేపటినుంచి అలా చూస్తున్నాడో అనుకుంది. సిగ్గుతో ముడుచుకుపోయింది. తన నిద్రముఖం కనిపించకుండా నిండా ముసుగు కప్పుకోవాలనిపించింది. పమిటకొంగు చాలీచాలకుండా ఉంది. అతను తెల్లగా ఎంతో అందంగా ఉన్నాడు. అతను కట్టుకున్న బట్టలుకూడా తెల్లగా మల్లెపువ్వుల్లా ఉన్నాయి. నీల తెల్లపోయింది.

ఆ కొండప్రాంతంలో ఎవరూ అంత అందంగావుండరు నీరుకావిబట్టలు తప్ప ఎవరూ అంత తెల్లని బట్టలువేసుకోరు. నీలకు అతనెవరో దేవలోకంనుంచి వచ్చినట్లనిపించింది. విస్తుపోయి చూస్తూకూర్చుంది. నీటిఅంచున రెండు తెల్లని ఉడతలు అటూ ఇటూ పరుగులుపెట్టాయి. చెట్లకొమ్మల్లోంచి తెల్లనిపిట్టలు గబగబా పైకి ఎగిరాయి. నీలకు స్పృహ కలిగింది. మామూలుధోరణిలోపడ్డది. కొండదిగి పాకవేపు పరుగుపెట్టింది. అవ్వతో చెప్పింది. అక్కడెవరో కొత్తవ్యక్తి వచ్చాడని. అవ్వఅన్నది "అవును, మధ్యాహ్నం వచ్చాడు. ఆ పైనపాకలో వున్నాడు. రేపుకూడా వుంటాడట. కోకిల చెప్పింది"అని నీలముఖం విప్పారింది. రేపంతా అతను తనకు తోడువుంటాడు. రోజంతా అతన్ని చూడవచ్చు, అతనితో మాట్లాడవచ్చు. ఆ కొండలో తనకిష్టమైన కోన

లన్నీ అతనికి చూపించవచ్చు. ఆ కొండమీద చెట్లపేర్లన్నీ తనకు తెలుసు. అతనికి తెలియవు. తాను చెబుతూవుంటే అతను విస్తుపోయివింటాడు. ఊహలతో ఆమె మనసు పరవశమైంది. చెట్లు, చేమలు, పక్షులు, వాగులూ ఇలాంటివితప్ప ఇంకెవరూ ఆమెకు ఎప్పుడూ తోడుఉండరు. ఆవేళ అతన్ని తలచుకుంటేనే ఆమెకు సంతోషం కలిగింది. ఎన్నోజన్మల అనుబంధంగా క్షణకాలంలోనే ఆమెమనస్సు అతన్ని పెనవేసుకుంది. రేపటికోసం ఎదురుచూస్తూ ఆమె నిద్రపోయింది.

ఉదయం లేవగానే ఆమె వాగుదగ్గరకు పరుగెట్టింది. నీళ్ళతో ముఖంకడుక్కుంది. తడిచేతులతో తలదువ్వుకుని ముడివేసుకుంది. జీవితంలో మొట్టమొదటిసారిగా ఆమెకు తను ఎలాఉన్నానో అని సందేహం కలిగింది. వంగి నీళ్ళల్లో నీడచూచుకుంది. ఆమెకు నిస్పృహకలిగింది తను అందంగా లేదు. ముఖం నల్లగాఉంది. కళ్ళు లోతుగాఉన్నాయి. ఎంత సరిజేసిదువ్వినా జుట్టురేగి చింపిరిగాఉంది. కట్టుకున్న చీర మాసి కాపిరంగుగాఉంది. ఆమెకు దుఃఖంవచ్చింది. ఇంతవరకు తనరూపం ఎలాఉన్నదీ ఆమె పట్టించుకోలేదు. ఇవ్వాళ ఈ రూపం నచ్చలేదు. ఇంటికి పరుగెత్తుకువెళ్ళింది. పెట్టెలో అడుగున ఎక్కడోవున్న. చుక్కలచీర తీసి కట్టు

కుంది. అప్పుడుకాస్త ఊరట కలిగింది. నల్లని చీరమీద ఎర్రనిచుక్కలు ఎంతో బాగున్నాయి.

కొంచం ఎండ పడుతూవుంటే అతను నీటిధారదగ్గరకు వచ్చాడు. అతని చేతినిండా తెల్లని పువ్వులు గుత్తులుగా ఉన్నాయి. ఆ కొండలో అక్కడక్కడా కోసుకున్నట్లున్నాడు. నీల అతనినిచూసి నవ్వింది. అతనూ నవ్వాడు. ఇవ్వాళఅతను కొత్త వ్యక్తికాదు. చాలారోజులుగా తెలిసిన మనిషిలా ఉన్నాడు. నీల అతనిని పలకరించింది. "కొండ చూడటానికి వచ్చావా?" అంది. అతను "అవును" అన్నాడు. ఆమె ఉత్సాహంతో చెప్పింది. నా పేరు నీల. మేము ఇక్కడే ఉంటాము నాకీ కొండలో ప్రతి కోనా తెలుసు. నేను తోవచూపించగలను" అంది. అతను ఉత్సాహం చూపించలేదు. నిర్లిప్తంగా చూస్తూ "నేను నిన్ననే చాలా చూశాను. గణపతి తోడు వచ్చాడు" అన్నాడు. ఆ నీళ్ళ ఒడ్డున కాళ్ళు చాపుకు గడ్డిలో కూర్చున్నాడు. చేతిలో పువ్వులు విడివిడిగా తీసి జంటలుగా పేర్చి విలాసంగా ఆడుకుంటున్నాడు.

నీల పక్కనే కూర్చుంది. ఆమె తలలో వేయి ప్రశ్నలు అతనిని వెయ్యాలని వేగిరపడుతున్నాయి. అతని పేరడిగింది.

"మైత్రేయ" అన్నాడు. ఆ పేరు ఆమెకు వింతగా ఉంది. మనసులో మళ్ళా మళ్ళా అనుకుంది "మైత్రేయ మైత్రేయ" అని. ఆ పేరు ఎంతో బావుందనిపించింది. అతని ఊరడిగింది. ఏదో చెప్పాడు ఆ ఊరు ఎక్కడ ఉందో ఆమెకు తెలియదు. ఆమె ఎప్పుడూ కొండ వదలిపోలేదు. ఆ ఊరు చాలా దూరం కాబోలు అనుకుంది. పక్కకు తిరిగి లోయవేపు చూసింది. తెల్లగా మెలికలు తిరిగిన తోవ కనిపించింది. ఆ తోవ వెంబడే చాలా దూరంపోతే అతని ఊరు వస్తుంది కాబోలు అనుకుంది. అతనికి ఆ లోయ చూపిస్తూ అడిగింది. "నీవు ఆ తోవన వచ్చావా!" అని, అతను "అవును" అన్నాడు. "మీ ఊరు చాలా దూరమా?" అంది. అతను నవ్వాడు. "ఆ, చాలా దూరమే." అన్నాడు. ఆ తరువాత ఏం మాట్లాడాలో ఆమెకు తెలియలేదు. అతను వంగి నీళ్ళల్లో చేతులు ముంచి ఆడుకున్నాడు. చేతిలోని పువ్వులు ఒక్కొక్కటి నీళ్ళలో వదిలాడు. ఆమె ముంగుకు వంగి నీళ్ళతోపాటు జారిపోకుండా చెయ్యి జాపి ఒకపూల గుత్తిని గట్టిగా పట్టుకుంది, ఏదో అపురూపమైన వస్తువు అందుకున్నట్టు సంబరపడ్డది. సంతోషంతో అతనివేపు చూసింది. అతను ఆమెను గమనించలేదు. నిర్లిప్తంగా కాళ్ళుచేతులు నీళ్లలో తడుపుకుంటూ ఆడుకుంటున్నాడు. మెల్లగా ఏదో పాడుకుంటున్నాడు. ఆమెకు విపరీతమైన కుతూహలం కలిగింది. ఆమెకు పాట

లంటే చాలా యిష్టం, ఎప్పుడూ ఒంటరిగా అవ్వనేర్పిన పాటలు పాడుకుంటూ వుంటుంది. అవితప్ప ఆమెకింకేవీ రావు. వుండలేక అతన్ని అడిగింది. "నీకు పాటలు వచ్చా? "అని. అతను నవ్వాడు. "నాకు పాటలు రావు. నేను పాటలు రాయగలను. పాటలు పాడగలను." ఆ సమాధానం ఆమెకు సరిగా అర్థం కాలేదు. అతని పాటలు వినాలని ఎంతో కోరిక కలిగింది ఆ కుతూహలం ఆమెను నిలువనీయలేదు. అతనిని పాడమని పదేపదే అడిగింది. అతనువినిపించు కోలేదు, జవాబు చెప్పలేదు మెల్లగాపాడుతున్నపాటకూడా ఆపివేశాడు. ఆమె నిరుత్సాహపడింది. కాసేపటికి అతను అన్నాడు. "ఆ కొన శిఖరందాకా ఎప్పుడైనా ఎవరైనా వెళ్ళారా?" అని, ఆమెలో మళ్ళా ఉత్సాహం మొలకెత్తింది. కుతూహలంతో అన్నది "లేదు. నాకు ఎన్నాళ్ళ గానో వెళ్లాలనిఉంది. కాని ఒంటరిగా వెళ్ళడానికి భయం. అక్కడెవరో యోగి ఉన్నాడంటారు. ఉన్నాడో లేదో తెలియదు"అని. ఈ సారి అతని ముఖంలో కుతూహలం కనిపించింది.

"ఇవాళ నేను చివరిదాకా వెళ్లివస్తాను." అన్నాడు పట్టుదలగా. ఆమె అప్రయత్నంగా "నేనూ వస్తాను" అంది ఉత్సాహంతో, ఆ కొండంతా అతనితో కబుర్లు చెపుతూ

కలిసి ఎక్కడం ఎంత బావుంటుంది అనుకుంది సంతోషంగా. అతను మాట్లాడలేదు. ఆమెను రమ్మనలేదు, రావద్దనలేదు. నీటిపాయ అంచువెంబడి మెల్లమెల్లగా పైకి ఎక్కటం ప్రారంభించాడు. ఆమె వెనకాలే వెళ్ళింది. నిలువలేనినీడలా అతను వెనక్కు తిరిగి చూడలేదు. ఆమె వస్తోందో లేదో గమనించలేదు గబగబ పైకి సాగిపోతున్నాడు. ఆమె వెనక మెల్లమెల్లగా వెళ్లింది.

అతనితో కూడావెళ్లటం ఆమెకు సాధ్యం కాలేదు. కాస్సేపటికి అతను కంటికి కనిపించలేదు. ఎంతో దూరంగా వెళ్ళిపోయాడు. ఆమెకు నిస్పృహ కలిగింది. ఆయాసం వచ్చింది. ఏడుపువచ్చింది. ఆమె అక్కడే కూర్చుండి పోయింది, అప్పుడు లీలగా మనసుకు తోచింది. అతనితో వెళ్లాలని తను ఆతృతపడుతోంది. తనుకూడా రావాలని అతనికి కోరికలేదు. ఆ కొనశిఖరం చూడాలన్న తపన ఇంకా తీరదు. ఆమెకు విపరీతమైన దిగులు కలిగింది. ఒక్కసారిగా ఆ కొండ అంతా శూన్యంగా ఉన్నట్లనిపించింది ఏ మూల నుంచో అతడు పాడుతున్నాడు. ఆ పాటవిని ఆమె ఉలిక్కి పడింది. మనసు పరవశమైంది, ఆమెకు పాట రాగం వినపడు తోంది. కాని మాటలు సరిగా తెలియలేదు. అది అతను రాశాడేమో, ఆ పాటకు అర్థమేమిటో అనుకుంది. మనసు

మళ్ళా క్రుంగిపోయింది. కాస్సేపటికి క్రిందకు దిగి ఇంటికి వెళ్ళింది.

మధ్యాహ్నం మళ్ళా అతన్ని చూసింది. ఆ నీటిధార దగ్గర అతన్ని చూడగానే పొద్దున్న దిగులంతా మరచిపోయింది. నిలువలేక ఉత్సాహంతో దగ్గరకు వెళ్ళింది. సంతోషంగా అడిగింది, "చివరిదాకా వెళ్ళావా, అక్కడ నిజంగా యోగి వున్నాడా? నీతో మాట్లాడాడా?" అంది. అతను పొద్దునలాగే నిర్లిప్తంగా ఉన్నాడు. "లేదు నేను పైదాకా వెళ్ల లేదు. కొంతదూరం వెళ్ళి వచ్చేశాను" అన్నాడు ఆమె నిరుత్సాహపడింది. పరధ్యాన్నంగా లోయవేపు చూసింది. అక్కడ త్రోవచూడగనే మనస్సు కలుక్కుమంది. "ఇవ్వాళ వెళ్లిపోతావా"అంది దిగులుగా. అతను "అవును ఇంకాస్సేపట్లో వెళతాను" అన్నాడు. ఆమె ముఖం వాడిపోయింది. తను ఒకసారి ఆ లోయకు వెళ్ళింది ఆ త్రోవవెంబడి చాలా దూరం వెళ్ళాలనుకుంది. దూరాన నీటిమడుగు తళతళలాడుతూ కనిపించింది. ఆ మడుగు చూడాలనుకున్నది. కాని మనసులో భయమూ, సంకోచమూ, అడుగు ముందుకు వెయ్యలేకపోయింది. వెనక్కు తిరిగి వచ్చేసింది. అది జ్ఞాపకం వచ్చింది. హఠాత్తుగా అంది.

"ఆ త్రోవలో దూరంగా పెద్దమడుగు ఉందికదూ! ఎప్పుడూ తళతళ మెరుస్తూ ఉంటుంది"అని అతను నవ్వాడు.

"మడుగూలేదు ఏమీలేదు" అన్నాడు. ఆమె నమ్మలేదు. సందేహంగా అంది "ఒకసారి నేనా త్రోవన వెళ్లాను. దూరాన తళతళా మెరుస్తూ చక్కగా కనుపించింది. ఒంటరిగా పోలేక నేను దగ్గరకు పోలేదు" అని, అతను మళ్లా చెప్పాడు "ఎండవేళ అలానే కనుపిస్తుంది. ఎండమావి, దూరాన్నుంచి మడుగులాగే వుంటుంది. దగ్గరకు వెళ్ళే కొద్దీ దూరం దూరంగా పోతూవుంటుంది" అని. నీలకు నిస్పృహ కలిగింది. నీరు నిండిన మడుగులా ఉంటుంది. నిజంగా నీళ్లులేవు. ఆమాట ఏదో దిగులుగా వుంది. వాడిపోయిన బ్రతుకులా వుంది.

కాసేపటికి గణపతి వచ్చాడు. చేతిలో సంచి వుంది. అతనికేసేచూస్తూ అన్నాడు, "మీరు పొద్దువుండగానే కిందకు దిగితే మంచిది, పదండి నేనుకూడా వస్తాను. అందాకా!" అని. గణపతి గట్టుదిగి ముందుకు నడిచివెళ్లాడు అతను బద్ధకంగా లేచి నుంచున్నాడు. నీలకేసి ఓసారి చిరునవ్వుతో చూశాడు. మళ్ళా గణపతి వెనకాలే ముందుకు సాగిపోయాడు, నీల అక్కడే అతన్నిచూస్తూ నిలబడింది. ఆమె మనస్సు శూన్యంగా ఉంది. అతను ఒక్కొక్క అడుగు ముందుకు సాగిపోతూవుంటే మనసు ఇంకా ఇంకా దిగులుగా నీరసపడింది. అతను ఒక్కసారైనా వెనక్కుతిరిగి చూడలేదు ఆమె ఒక్కక్షణమైనా చూపులు వెనక్కు మరల్చుకోలేదు.

కాస్సేపటికి అతను కనిపించలేదు. నీల నిస్పృహతో తల వంచుకుంది, చీకటిపడేవరకు ఒంటరిగా అక్కడే కూర్చుంది. మసకచీకట్లో కొండ బావురుమంటోంది. పొద్దున్న కొండ ఎక్కుతూ అతను పాడినపాట చెవులకువినిపిస్తోంది. ఆ పాటకు అర్థమేమిటో, మాటలేమిటో తెలియదు. మాటలు తెలియని పాట, నీళ్ళులేని మడుగు, మమతలేని మనసు! అంతా ఏదో దిగులుగా ఉంది. అతను మళ్ళా ఎన్నడూ రాడేమో ! తను అతన్ని మర్చిపోలేదు. ఎప్పుడూ ఈ దిగులు పోదేమో! ఒక్క క్షణంవచ్చి మరుక్షణం మాయమైన వ్యక్తిమీద మమకార మేమిటి? అది ఆమెకు తెలియని వ్యథ. చీకటి భరించలేక ఇంటికి వెళ్ళింది.

అవ్వ అప్పుడే దీపం పెడుతోంది. నీల వెళ్ళి ఆమె దగ్గర కూర్చుంది. దిగులుగా ఆమె ముఖంకేసి చూసింది. నీలకొక ఆలోచన వచ్చింది. కొన్నాళ్ళకు తను అవ్వలా అయిపోతుంది. తలంతా తెల్లగా నెరసిపోతుంది. ముఖం ముడతలు పడుతుంది. చేయి వణకుతుంది. అప్పుడూ తను అతన్ని గురించి ఆలోచిస్తూ ఉంటుందా ? అతని తెల్లని ఆకారం ఇంకా కళ్ళల్లో మెదులుతూ ఉంటుందా? ఆమెకు భయం వేసింది. అవ్వను గట్టిగా కావలించుకుంది. వెక్కి వెక్కి ఏడ్చింది. ఎంత ఆపుకున్నా దుఃఖం ఆగలేదు. ఎన్నో జన్మలుగా ఆత్మలో అణచిపెట్టుకున్న దుఃఖం ఆగలేక పైకి ఉబికిందా అనిపించింది అవ్వ ఆప్యాయంగా నీల తల నిమి

రింది. "ఊరుకో అమ్మా! ఎందుకూ" అన్నది మెల్లగా. ఆమె మునివ్రేళ్ళు లీలగా నీల తలను తాకుతున్నాయి. ఆమె అపేక్ష హద్దులు తెంచుకుని తనమీద ప్రవహిస్తున్నట్లని పించింది నీలకు. ఆ ఆప్యాయతతో కొంచెం కోలుకుంది. అవ్వతో మురిపెంగా అంది, "అవ్వా అమ్మకోసం మామిడి మొక్క నాటావుకదూ? నేను పోతే నా కోసం ఆ కొండ తెల్లపువ్వుల చెట్టు నాటు, ఎప్పుడూ తెల్లని పువ్వులుపూస్తు ఉంటుంది. ఆ పువ్వులు ఉన్ననాళ్ళు నేనూ ఉంటాను." అవ్వ మనస్సు కలుక్కుమంది. "నేను శాశ్వతంగా ఇక్కడే ఉంటానా!" అనుకుంది తనలో అయినా మాట్లాడలేదు.

నీల కళ్ళు తుడుచుకుంది. అవ్వ అన్నం తినమంది. నీల వద్దన్నది. అవ్వ రెండుచేతులు ఆప్యాయంగాతీసి మెడకు చుట్టుకుంది. కళ్ళకు నిద్రకమ్మింది. క్షణంలో నిద్రపోయింది.

ప్రొద్దున్నే లేచి మామిడిచెట్టు దగ్గరకువెళ్ళి కూర్చుంది చెట్టుకొమ్మల్లోంచి రామచిలక పలకరించింది. ప్రేమగా. నీల సిగ్గుపడి ముఖం వాల్చుకుంది, ఏదో తప్పుచేసినట్లు!

— — —